క్లుప్తంగా

ప్రతిభా పురస్కారాలకు ఎంపిక


మేఘన వెంకటసత్య


తివారి ప్రియ

రామచంద్రపురం రూరల్: ప్రభుత్వం ప్రకటించిన ప్రతిభా పురస్కారాలకు సూర్య ఇంగ్లిష మీడియం హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు స్కూల్ కరస్పాండెంట్ దొడ్డా శ్రీనివాసకుమారి గురువారం విలేకరులకు తెలిపారు. తోటపేటకు చెందిన దవులూరి మేఘన వెంకటసత్య, తివారి ప్రియలు ప్రతిభా పురస్కారాలకు ఎంపిక కాగా వారిని అడకమిక్ డైరెక్టర్ దొడ్డా మణి స్వరూప్, యాజమాన్యం దొడ్డా సత్తిబాబు, కై రం తాతాజీ, పెన్నాడ బుచ్చిరాజు అభినందించారు.

నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు

కపిలేశ్వరపురం: మండలంలోని తాతపూడి, కపిలేశ్వరపురం, కేదారిలంక ర్యాంపుల నుంచి నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారని వైస్ ఎంపీపీ సాకా శ్రీనివాస్, టీకి, అంగర, నేలటూరు, వల్లూరు ఎంపీటీసీ సభ్యులు ఉమ్మడిశెట్టి వీరవేణి, అడ్డాల శ్రీనివాస్, రుద్రాక్షుల వీరగౌరీ కుమారి, పెందుర్తి శిరీష వాపోయారు. జియో కో ఆర్డినెన్స్ నిబంధనలను తుంగలోకి తొక్కుతూ చేపడుతున్న తవ్వకాలతో గోదావరి నదిలో లోతైన గుంతలు ఏర్పడుతున్నాయన్నారు. గుంతల్లో నీరు చేరిన తర్వాత స్నానాలకు దిగిన వారు గుంతల్లో చిక్కుకుపోయి మృత్యువాత పడుతున్నారన్నారు. ఇటీవల కాలంలో కేదారిలంకలో వరస ఘటనల్లో పలువురు మృతి చెందిన విషయాన్ని గుర్తు చేశారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ నెల 2న ప్రజావేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని ప్రజాప్రతినిధులు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కాజులూరు: ఇంజరం 33/11 కేవీ విద్యుత్ స్టేషన్ పరిధి కాజులూరు మండలంలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ కాకినాడ ఈఈ ఎస్.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. గురువారం గొల్లపాలెం మెయిన్ సబ్ స్టేషన్ ఏఈ వీరిెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సబ్‌స్టేషన్, విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ అంతరాయం ఏర్పడుతుందన్నారు. కోలంక 11 కేవీ ఫీడర్ పరిధిలో గల కోలంక, నామవానిపాలెం, ఉప్పుమిల్లి, తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయాల్సి వస్తుందన్నారు.

చిరంజీవినీకుమారి మృతి తీరనిలోటు

కపిలేశ్వరపురం: విద్యా, సాహితీవేత్త కాకినాడకు చెందిన చిరంజీవినీ కుమారి మృతి సామాజిక ఉద్యమాలకు తీరని లోటని అంగర గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త పెద్దిరెడ్డి రామకృష్ణ అన్నారు. దీర్ఘకాలంగా ఆమె చేసిన సాహితీ కృషి సమాజ ఉన్నతికి విశేషంగా దోహదపడిందన్నారు. ఆమె ప్రోత్సాహంతో ఎందరో అభ్యుదయ భావాలుగల వ్యక్తులు, సంఘాలు ముందుకు వచ్చారన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

కపిలేశ్వరపురం (మండపేట): ఇటీవల ముమ్మిడివరం సమీపంలో గోదావరిలో స్నానానికి దిగి ప్రమాదవశాత్తూ మండపేట పట్టణానికి చెందిన కులపాక మల్లేశ్వర వీర వెంకట రోహిత్ మృతి చెందాడు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తరపున రూ.2 లక్షల సాయం మంజూరైంది. సంబంధిత చెక్కును మృతుడి సోదరి బిందుమాధవికి గురువారం టిడ్కో గృహ సముదాయంలోని ఆమె ప్లాట్‌కు వెళ్లి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అందజేశారు.

సత్యసాయి రథానికి స్వాగతం

కొత్తపేట: భగవాన్ సత్యసాయిబాబా వారి శత జయంతి రథయాత్రకు కొత్తపేటలో ఘన స్వాగతం పలికారు. సత్యసాయి బాబా శత జయంతి మహోత్సవాలను పురస్కరించుకుని లోక కల్యాణార్థం సత్యసాయి ప్రేమ ప్రవాహిని (రథోత్సవం) పుట్టపర్తి దివ్య క్షేత్రం నుంచి దేశ వ్యాప్తంగా ఆసేతు హిమాచల పర్యంతం శోభా యాత్రగా నిర్వహిస్తున్నారు. రాష్ట్ర సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధి, జిల్లా సేవాదళ్ కన్వీనర్ మన్యం పర్వతవర్ధనరావు, జిల్లా సమితి సభ్యుల ఆధ్వర్యంలో ఈ నెల 3 జిల్లాలో ప్రవేశించిన రథయాత్ర గురువారం కొత్తపేట మండలం మోడకుర్రు శివారు గొలకోటివారి పాలెం నుంచి ప్రారంభమైంది. అక్కడి నుంచి కొత్తపేట చేరుకున్న రథయాత్రకు స్థానిక సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కంకటాల సత్య నారాయణ (కేఎస్ఎన్) ఆధ్వర్యంలో సమితి సభ్యులు, సత్యసాయి మహిళామండలి, కోలాటం బృందం, బాలవికాస్ బాలలు, అత్యధిక సంఖ్యలో భక్తులు ఘన స్వాగతం పలికారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల నుంచి మహిళలు పూర్ణకుంభాలతో తోడ్కొని వెళ్లారు. రథయాత్రలో పాల్గొన్న వారికి, స్థానిక భక్తులకు స్థానిక సేవా సమితి ఆధ్వర్యంలో అల్పాహారం , మజ్జిగ పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ సమాజ సేవలో తరించాలన్నదే సత్యసాయి సందేశమని జిల్లా సేవాదళ్ కన్వీనర్ వర్ధనరావు అన్నారు. ఈ రథయాత్ర సందర్భంగా వర్ధనరావు మాట్లాడారు. సత్యసాయి సూక్తులను ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు.

• శిథిల వ్యథ.. పట్టదా!


కపిలేశ్వరపురం లాకుల వద్ద అధ్వానంగా ఉన్న క్వార్టర్స్

కపిలేశ్వరపురం: స్థానిక బ్యాంక్ కెనాల్‌పై బ్రిటీషు కాలంలో నిర్మించిన ఇరిగేషన్ సిబ్బంది క్వార్టర్స్ నిరుపయోగంగా మారాయి. గౌతమి గోదావరి నీటిని స్థానిక లాకులు ద్వారా కపిలేశ్వరపురం, కె.గంగవరం మండలాల ఆయకట్టుకు అందిస్తారు. ఆ రోజుల్లో లాకుల నిర్వహణ ప్రాధాన్యం నేపథ్యంలో స్థానికంగా క్వార్టర్స్ నిర్మించారు. ఇందులో సూపరింటెండెంట్, ముగ్గురు లస్కర్లు, ఒక డెల్టా లస్కర్ ఉండేవారు. ఆలమూరు సెక్షన్ ఏఈ కార్యాలయం ద్వారా పర్యవేక్షణ సాగుతుంది. ప్రస్తుతం భవనాలు శిథిల స్థితికి చేరి విష సర్పాలు సంచరిస్తున్నాయి.

ఇవండీ.. సంకోతులు


గొల్లపాలెంలో కొబ్బరి చెట్టుపై కోతి చేష్టలు

కాజులూరు: గొల్లపాలెంలో కొన్ని రోజులుగా కోతుల సమస్య వేధిస్తోంది. గ్రామ వీధిల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తూ కొబ్బరి చెట్ల నుంచి కాయలు, పిందెలను తుంచి పారేస్తున్నాయి. ఇళ్లపై అవి పరుగులు తీస్తుండటంతో పెంకులు ఊడిపడుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. చిన్నారులు మహిళలు, ఇంటి లోనుంచి బయటకు రావాలంటే భయాందోళనకు గురవుతున్నారు. తాళ్లరేవు అభయారణ్యం దగ్గర కావటంతో అక్కడి నుంచి కోతులు గుంపులుగా తణుకువాడ, శలపాకల మీదుగా గ్రామానికి చేరుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించాలని కోరారు.

• నిర్వహణ నీరుగారేలా..


మండపేటలో టిడ్కో అపార్ట్‌మెంట్ శ్లాబ్ ఇలా పెచ్చులూడి..

కపిలేశ్వరపురం (మండపేట): నిర్వహణ నీరుగారుతోంది. మండపేట గొల్లపుంత కాలనీలోని పలు టిడ్కో భవనాల శ్లాబ్‌లు దెబ్బతిన్నాయి. సీ–46 బ్లాక్‌లోని అపార్ట్‌మెంట్‌లో భవనం శ్లాబ్ పెచ్చులూడుతోంది. భవనాలతో పాటు అపార్ట్‌మెంట్ లున్న ఆవరణ సైతం అధ్వానంగా ఉంది. చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి విష సర్పాలు సంచరిస్తున్నాయి. అనేక భవంతులు ఖాళీగా ఉన్నాయి.

సేవలకు సెలవు..

- వెలవెలబోతున్న సచివాలయాలు
- తెరుచుకోని ప్రభుత్వ వెబ్‌సైట్లు
- అవస్థలు పడుతున్న ప్రజలు


అముజూరు గ్రామ సచివాలయం

కె.గంగవరం: సచివాలయం.. సమస్త సేవలకు నిలయం. ప్రజలందరికీ ప్రభుత్వ సేవలను దగ్గర చేయాలనే సంకల్పంతో ఈ వ్యవస్థను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించారు. తద్వారా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని తీసుకొచ్చారు. లక్షలాది మంది నిరుద్యోగ యువతకు సర్కారు కొలువు అందించారు. పంచాయతీ స్థాయిలో రెండు వేల మంది జనాభాకు ఒక సచివాలయం ఏర్పాటు చేశారు. గ్రామ ప్రజలకు అవసరమైన ప్రతి పనీ స్థానికంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. దీంతో సచివాలయ వ్యవస్థ అనతికాలంలో విజయవంతమైంది. వలంటీర్ల సహకారంతో అర్హులకు ఇళ్ల వద్దే సంక్షేమ పథకాలు అందేవి. అయితే ఇదంతా గతం. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సంక్షేమానికి తిలోదకాలు ఇచ్చింది. అనవసరమైన విషయాలను తెరపైకి తెచ్చి అసమర్థ పాలన చేస్తోంది. ప్రస్తుతం సచివాలయ వ్యవస్థకు తూట్లు పొడుస్తోంది. సచివాలయాల్లో అందే సేవల్లోనూ కోత విధించింది. నిత్యం సందడిగా ఉండే సచివాలయాలను నాలుగు నెలలుగా వెలవెలబోయేలా మార్చింది.

ప్రయోజనాలు ఎన్నో..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా సచివాలయాల వ్యవస్థను తీసుకువచ్చారు. దీనికి అనుసంధానంగా వలంటీర్లను నియమించారు. ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను నియమించి వారి ఇళ్ల వద్దే సేవలందించేలా చూశారు. సచివాలయాల్లో దాదాపు 545 రకాల సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ వ్యవస్థ ప్రజలందరికీ ఎంతో ప్రయోజనకరంగా ఉండేది. వివిధ రకాల ధ్రువీకరణ పత్రాల కోసం మండల కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండేది కాదు. రిజిస్ట్రేషన్లు కూడా సచివాలయాల్లో నిర్వహించేలా వాటి స్థాయిని పెంచారు.

వైభవం తగ్గి.. సేవలు ఆగి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సచివాలయాల వైభవం తగ్గిపోయింది. ఇప్పటికే వలంటీర్ల వ్యవస్థను తొలగించిన కూటమి సర్కారు సచివాలయ వ్యవస్థను కూడా నిర్వీర్యం చేసేలా చర్యలు తీసుకుంటోందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో అందించే సేవలను తగ్గించుకుంటూ పోతున్నారు. కుల, ఆదాయ, వన్‌బీ ఇతర సాధారణ సేవలు మాత్రమే ప్రస్తుతం సచివాలయాల్లో అందుబాటులో ఉన్నాయి. రేషన్ కార్డులు, నూతన పింఛన్లు, ఆరోగ్యశ్రీ కార్డుల జారీ, తదితర వెబ్‌సైట్లు గత నాలుగు నెలలుగా ఓపెన్ కావడం లేదు. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గంలోని కె.గంగవరం మండలంలో 26 గ్రామాలకు 18 సచివాలయాలు, రామచంద్రపురం రూరల్‌లో 26 గ్రామాలకు 19, కపిలేశ్వరపురం మండలంలో 19 గ్రామాలకు 20, రాయవరం మండలంలో 12 గ్రామాలకు 19, కాజులూరు మండలంలో 26 గ్రామాలకు 19 సచివాలయాలు ఉన్నాయి. ఇందులో సుమారు 1300 మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు.

అన్ని సేవలు అందించాలి



సచివాలయాల ద్వారా ప్రజలకు అన్ని సేవలు గతంలో మాదిరిగానే అందించాలి. ప్రస్తుతం సచివాలయాల్లో పూర్తి స్థాయిలో పౌరసేవలు అందించడం లేదు. సచివాలయ ఉద్యోగుల్ని కూడా వలంటీర్లుగా కూటమి ప్రభుత్వం మార్చేలా ప్రయత్నిస్తుంది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ పేరును నిలబెట్టే విధంగా ప్రయత్నాలు మొదలు పెట్టాలి.

–బత్తుల అప్పారావు, కుందూరు

మరింత మెరుగ్గా నడిపించాలి



రేషన్, పింఛన్ కార్డులు, ఇతర అవసరాల కోసం ప్రజలు దరఖాస్తులు చేసుకునేలా ప్రభుత్వం విధివిధానాలను రూపొందించి. వెబ్‌సైట్లను అందుబాటులోకి తీసుకురావాలి. వ్యవస్థలను మరింత మెరుగ్గా నడిపిస్తే ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది. అంతే తప్ప గత ప్రభుత్వంపై కక్షతో వారికి పేరు వస్తుందన్న నెపంతో సచివాయాలను నిర్వీర్యం చేసేలా అడుగులు వేయడం సరికాదు.

–వట్టికూటి శేఖర్, మాజీ ఎంపీపీ, కె.గంగవరం

హెల్త్ ఎడ్యుకేటర్ల హోదా మార్పు


సరోజినిని అభినందిస్తున్న డాక్టర్ రమ్యశ్రీ

రాయవరం: వైద్య ఆరోగ్య శాఖలో క్షేత్ర స్థాయిలో విధులు నిర్వర్తిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ (హెచ్ఈ) హోదాను మార్పు చేశారు. హెల్త్ ఎడ్యుకేటర్ హోదాను డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా మార్పు చేస్తూ ప్రభుత్వం జీవోఎంఎస్ నంబరు 64 విడుదల చేసింది. ప్రజలకు వివిధ రకాల వ్యాధుల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, ఆరోగ్య సిబ్బందికి శిక్షణ ఇవ్వడంతో పాటు, ప్రాంతీయ కంటి ఆస్పత్రులు, పీహెచ్‌సీలు, వైద్య కళాశాలల్లో సేవలు అందిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ క్యాడర్‌ను డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా హోదా మార్పు చేశారు. హెల్త్ ఎడ్యుకేటర్ హోదాను మార్పు చేయడాన్ని స్వాగతిస్తున్నట్లు రాయవరం పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ ఎ.సరోజిని తెలిపారు. హోదా మార్పు పట్ల పీహెచ్‌సీ వైద్యాధికారి రమ్యశ్రీ సంతోషం వ్యక్తం చేశారు.

కొత్త విద్యా సంవత్సరానికి సమాయత్తంకండి


హెచ్‌ఎంలకు సూచనలిస్తున్న అధికారులు

కె.గంగవరం: ఈ ఏడాది వేసవి సెలవులు త్వరలో ముగుస్తాయని, హెచ్‌ఎంలు విద్యా సంవత్సరం ప్రారంభానికి సమాయత్తం కావాలని ఎంఈఓ నాగరాజు సూచించారు. కె.గంగవరం ఎమ్మార్సీలో గురువారం హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల తరగతి గదులను, పరిసరాలను శుభ్రం చేసుకోవాలని, మధ్యాహ్న భోజన పథకాన్ని పాఠశాలలు తెరిచిన మొదటి రోజు నుంచి అమలు చేయడానికి రైస్, గుడ్లు, చిక్కీలు సేకరించుకోవాలన్నారు. పేరెంట్స్ కమిటీల సహకారంతో పాఠశాలల అభివృద్ధికి హెచ్‌ఎంలు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో పాటు ఈ నెల 9న ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో జరిగే యోగా కార్యక్రమానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు సిద్ధమవ్వాలని కోరారు. ఎంఈఓ– 2 చోడిశెట్టి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి ప్రాణాంతకం కాదు


తాతపూడి గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శిరీష తదితరులు

కపిలేశ్వరపురం: సకాలంలో స్పందిస్తే క్షయ వ్యాధి ప్రాణాంతకం కాదని డాక్టర్ శిరీష అన్నారు. టీబీ, ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పీఎస్ఎస్‌డీ రత్నకుమారి ఆధ్వర్యంలో తాతపూడిలో ప్రత్యేక అవగాహన శిబిరాన్ని నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ చేశారు. సామాన్య ప్రజలకు వ్యాధిపై అవగాహన కల్పిస్తామంటూ వైద్య ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, 104 బృంద సభ్యులు ప్రతిజ్ఞ చేశారు. డాక్టర్ శిరీష మాట్లాడుతూ శరీరంలో అలసట, తలనొప్పి, బరువు తగ్గడం, జ్వరం, రాత్రిపూట చెమటలు పట్టడం, ఆకలి మందగించడం లక్షణాలు కనిపిస్తే క్షయ వ్యాధిగా అనుమానిస్తూ సంబంధిత పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 2 నుంచి ఆగస్టు 30 వరకూ క్షేత్ర స్థాయిలో టీబీ ముక్త, భారత్ అభియాన్ అవగాహన శిబిరాలను నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈఓ జె.మల్లికార్జునుడు, హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు, ఎస్‌టీఎస్ రమణ, ఎస్‌టీఎస్‌ఎల్ ఎస్.బేగం, ఎంఎల్‌హెచ్‌పీ దీప్తి, వైద్య ఆరోగ్య కార్యకర్త దేవి పాల్గొన్నారు.

నీటి నిల్వలు లేకుండా చూడాలి


వెల్ల పీహెచ్‌సీలో వైద్యులకు సూచనలు చేస్తున్న జిల్లా మలేరియా అధికారి వెంకటేశ్వరరావు

రామచంద్రపురం రూరల్: ప్రతి గ్రామ/వార్డు సచివాలయాల్లో 'ఫ్రైడే డ్రైడే'ను విధిగా నిర్వహించి పరిసరాల శుభ్రత పాటించాలని జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు సూచించారు. వెల్ల పీహెచ్‌సీని ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జ్వరం సంబంధిత కేసులకు మలేరియా, డెంగీ రక్త పరీక్షలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. లేబరేటరీల్లో టెస్టింగ్ కిట్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. గత సంవత్సరంలో డెంగీ వ్యాధి వచ్చిన ప్రాంతాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు తమ ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. దోమల నుంచి రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ ఏడాది రామచంద్రపురం మండలంలో ఒక డెంగీ కేసు మాత్రమే నమోదైందన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి లక్ష్మీప్రసన్న, డివిజనల్ సూపర్‌వైజర్ జి.కమల్ శేషు, సూపర్‌వైజర్లు కె.శ్రీనివాస్, రత్నం, రాజేశ్వరి పాల్గొన్నారు.

నేడు మెగా జాబ్ మేళా

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో శుక్రవారం రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు సంస్థ జిల్లా అధికారి డి.హరిశేషు గురువారం తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. 10 సంస్థలకు చెందిన 380 ఖాళీలను భర్తీ చేసే లక్ష్యంతో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నామన్నామని హరిశేషు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

కాజులూరు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం అన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో అధికారులు, నాయకులు మొక్కల నాటే కార్యక్రమం నిర్వహించారు. కాజులూరులో ఎంపీపీ మాత భారతీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వాసంశెట్టి సత్యం పాల్గొని మొక్కలు నాటారు.

రాయవరం: స్థానిక శ్రీరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం వీఎస్ సునీత ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. అలాగే మండలంలోని పలు పంచాయతీల్లో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు.

పర్యావరణ హితం కోసం కృషి

కపిలేశ్వరపురం: మొక్కలను నాటి ప్రతి ఒక్కరూ పర్యావరణ హితం కోసం పాటుపడాలని వక్తలు అన్నారు. మండలంలోని 19 గ్రామాల సచివాలయాల వద్ద గురువారం ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. తాతపూడి, కపిలేశ్వరపురం, అంగర తదితర గ్రామాల్లో కార్యక్రమాలు జరిగాయి. మండపేట రూరల్ మండలం ద్వారపూడి పీహెచ్‌సీ ఆవరణలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మొక్కలు నాటారు. మండపేటలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కేశవరంలో గ్రామానికి చెందిన యువకుడు యడ్ల రవి ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం శ్రామికులకు క్లాత్ బ్యాగ్‌లను అందజేశారు. ప్లాస్టిక్ వినియోగం మానుకోవాలని అన్నారు.

రాయవరం: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలని ఎంపీపీ నౌడు వెంకటరమణ పిలుపునిచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో మొక్కలు నాటారు. ఎంపీడీఓ కీర్తిస్పందన, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ వుండవిల్లి రాంబాబు, జెడ్పీ ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ దేవిశెట్టి చిన్ని పాల్గొన్నారు.


రామచంద్రపురం కోర్టు ప్రాంగణంలో..

రామచంద్రపురం: పట్టణంలోని కోర్టు ఆవరణలో అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ బి.నాగేశ్వరరావు నాయక్ మొక్కలు నాటారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉండవిల్లి గోపాలరావు, జనరల్ సెక్రటరీ బొడ్డు వరాహ నరసింహమూర్తి, కోశాధికారి చింతపల్లి శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు మాగాపు అమ్మిరాజు, దొమ్మలపాటి సత్యనారాయణ, న్యాయవాదులు పాల్గొన్నారు. పట్టణంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, కమిషనర్ రాజు, మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి సత్యం మొక్కలు నాటారు.

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ గురుకుల పాఠశాల/కళాశాల ఆవరణలో రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ మొక్కలు నాటారు. సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఆర్డీఓ దేవరపల్లి అఖిల, ఎంపీడీఓ కడలి పద్మజ్యోతి పాల్గొన్నారు. ద్రాక్షారామలో పిరిమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం నుంచి వన సంరక్షణ మహా ఉద్యమ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆ ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంత్రి సుభాష్ తండ్రి సత్యం, సర్పంచ్ కొత్తపల్లి అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, ద్రాక్షారామ సీనియర్ పిరిమిడ్ మాస్టర్లు జుత్తుక వెంకట్రావు, సుబ్రహ్మణ్య గుప్తా, రామారావు, విఠల్ మాస్టారు పాల్గొన్నారు.


ద్రాక్షారామ ఎస్సీ గురుకుల పాఠశాలలో మొక్క నాటుతున్న మంత్రి సుభాష్


సోమేశ్వరం పంచాయతీ పరిధిలో మొక్క నాటుతున్న సర్పంచ్ ఆరిఫ్

మహా ప్రసాదం స్వామీ..

- అప్పనపల్లి ఆలయానికి అన్నదానంలో పేరు
- రాష్ట్రంలో ఇక్కడి నుంచే తొలిసారిగా కార్యక్రమం


అప్పనపల్లిలో స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

మామిడికుదురు: అన్నం పరబ్రహ్మ స్వరూపం.. అలాంటి అన్నదానం మహోన్నతం.. మహా అద్భుతం.. అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి ఆలయం అన్నదానంలో ఆదర్శంగా నిలిచింది. రాష్ట్రంలో మొదటిసారిగా అప్పనపల్లిలోనే అన్నదానానికి నాంది పలికారు. 1977లో ఆలయ వ్యవస్థాపకుడు, దివంగత మొల్లేటి రామస్వామి నిత్యాన్నదాన పథకానికి శ్రీకారం చుట్టారు. ఇతర ఆలయాల్లో అన్నదానానికి అప్పనపల్లి ఆదర్శంగా నిలిచింది. నిత్యం బూరె, పులిహోర, మూడు రకాల కూరలు, పెరుగుతో అమలు చేస్తున్న అన్నదాన పథకం ఆలయ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. ప్రతి రోజు ఉదయం తొమ్మిది గంటల నుంచి రాత్రి పదకొండు గంటల వరకూ ఈ ఆలయంలో భక్తులకు ఉచితంగా అన్నదానం చేస్తున్నారు. ఏటా లక్షలాది మంది భక్తులు ఇక్కడ స్వామివారి అన్న ప్రసాదం స్వీకరిస్తున్నారు. స్వామివారికి భక్తులు సమర్పించే విరాళాలు, డిపాజిట్లపై వచ్చే ఆదాయం ద్వారా ఈ అన్నదానాన్ని నిరంతరాయంగా నిర్వహిస్తున్నారు.

నిరంతరాయంగా నిర్వహణ

నిత్యం సుమారు రెండు వేల మంది భక్తులు స్వామిని దర్శించుకుంటున్నారు. ఈ సంఖ్య శని, ఆదివారాల్లో ఎక్కువగా ఉంటుంది. స్వామి వారిని దర్శించుకునే భక్తుల్లో అధిక శాతం మంది అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్నారు. శని, ఆదివారాలు మినహా మిగిలిన రోజుల్లో నిత్యం ఏడు నుంచి ఎనిమిది వందల మంది స్వామివారి సన్నిధిలో భోజనాలు చేస్తున్నారు. గత ఏడాది 4,65,528 మంది భక్తులు ఆలయంలో అన్న ప్రసాదం స్వీకరించారు. నిత్యాన్నదాన పథకానికి విరాళాలుగా చెల్లించిన డిపాజిట్లు రూ.2.18 కోట్లు. దీనిపై ఏటా రూ.10.49 లక్షల వడ్డీ వస్తుంది. దీంతో పాటు భక్తులు నిత్యాన్నదానానికి గత ఏడాది భక్తులు రూ.1.47 కోట్లు విరాళాలుగా ఇచ్చారు. డిపాజిట్లపై వచ్చే వడ్డీతో పాటు భక్తులు నిత్యం స్వామివారి అన్నదాన ట్రస్టుకు ఇచ్చే విరాళాలతో ఈ పథకం నిర్వహణ నిరంతరాయంగా సాగుతోంది. గత ఏడాది రూ.72.64 లక్షల ఖర్చు అయ్యింది.